ప్రజాశక్తి

శుక్రవారం 3 ఫిబ్రవరి 2023

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

తప్పుల తడక



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

- చదువులేకున్నా పట్టభద్రుల ఓటర్లుగా నమోదు
- చిట్టివలస ఓటరుకు మునగపాక బూత్‌లో పేరు
- ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాను సరిచేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల తుది జాబితాలో అనర్హుల పేర్లు దర్శనమిస్తున్నాయి. గతంలో ఓటర్ల నమోదులో జరిగిన లోపాలను సరిచేయాలని సిపిఎం, ప్రజా సంఘాలు తహశీల్దార్లు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఆ లోపాలను పెద్దగా సరిచేయలేదు. ఓటర్ల నమోదు చివరి రోజుల్లో వైసిపి నాయకులు, వాలంటీర్లు విద్యార్హతలను పక్కనబెట్టి ఓటర్ల నమోదు చేయించారు. తుది జాబితా విడుదలచేసే ముందు విద్యార్హతలు లేని ఓటర్లను జాబితా నుంచి తొలగించే పనిని ప్రభుత్వ యంత్రాంగం సరిగా చేయకపోవడంతో అనర్హులు పట్టభద్రుల ఓటర్లుగా నమోదయ్యారు. 2019 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పాసైన పట్టభద్రులు ఓటరు నమోదుకు అర్హులుకాగా, చదువుకోని వారి నుంచి ఐదు, పది, ఇంటర్, డిప్లొమో, జిఎన్ఎం, ఐటిఐ, పియుసి చదివిన వారిని కూడా గుడ్డిగా నమోదుచేశారు. పట్టభద్రుల తుది ఓటర్ల జాబితాలోని అనర్హుల ఓటర్లను తొలగించాలని బుధవారం డిఆర్ఒ వెంకటరమణకు సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ, అల్లురాజు వినతిపత్రం అందజేశారు. విద్యార్హతలేని వారి జాబితా ఆయనకు ఇవ్వడంతో తుది జాబితాలోని లోపాలు బయటకొచ్చాయి. అనర్హులను ఓటర్లుగా చేర్పించి లబ్ధిపొందాలని చూస్తున్న అధికార పార్టీకి అధికారులు సహకరిస్తున్నట్లు ఓటర్ల జాబితాలోని లోపాలను బట్టి అర్థమవుతుంది. రెండు నుంచి నాలుగుసార్లు నమోదైన ఓటర్లున్నారు. ఓటేసే ఆసక్తి లేకుండా నివాసిత ప్రాంతానికి సుదూరంగావున్న పోలింగ్ బూత్‌లో కొన్ని పేర్లున్నాయి.

మునగపాక మండలంలోని బూత్ నెంబరు 196లోని 30 మంది ఓటర్ల పేర్లు రెండుసార్లు నమోదయ్యాయి. రెండుసార్లు నమోదైన ఓటర్లను తొలగించాలని సిపిఎం నాయకులు మునగపాక తహశీల్దార్‌కు లిఖితపూర్వకంగా తెలియజేసినా వాటిని సరిచేయలేదు. ఒక మండలంలోని ఓటర్ల పేర్లు మరొక మండలంలోని బూత్‌లో వున్నాయి. అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలోని బూత్ నెంబరు 196లో సుమారు 60 కిలోమీటర్ల దూరంలోవున్న భీమునిపట్నం, చిట్టివలసకు చెందిన శ్వేతా మీనన్ (సీరియల్ నెంబరు 877), మాధురి తాటిపూడి (సీరియల్ నెంబరు 604) పేర్లున్నాయి. ఇతర మండలాలకు చెందిన వంద మంది ఓటర్ల పేర్లు మునగపాక మండలంలోని 196 బూత్‌లో వున్నాయి. మునగపాక మండలం గవర్ల అనకాపల్లికి చెందిన కాండ్రేగుల రామసూరి అప్పారావు తహశీల్దార్ కార్యాయంలో అప్లికేషన్ ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో (నెంబరు 750255557) దరఖాస్తు చేసుకున్నా ఓటర్ జాబితాలో పేరులేదు. పోలింగ్ బూత్ 166లో సీరియల్ నెంబరు 502, పోలింగ్ బూత్ 167లో సీరియల్ నెంబరు 430, 495, 496, పోలింగ్ బూత్ 169లో సీరియల్ నెంబరు 115, మిగతా 2లో..

డిసిఐ చారిత్రాత్మక ఒప్పందం

ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి రూ.204.5 కోట్ల పనుల ఆర్డర్



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ కేంద్రంగాగల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) లిమిటెడ్ మరో చారిత్రాత్మక ఒప్పందాన్ని తాజాగా కుదుర్చుకుంది. కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ పరిధిలోగల ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐడబ్ల్యుఎఐ)తో రూ.204.5 కోట్ల మెయింటెనెన్స్ పనులకు ఆర్డర్‌ను డిసిఐ పొందింది. దేశంలోనే ప్రధానమైన డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేజర్ పోర్టులు, మైనర్ పోర్టులు, ఇండియన్ నేవీ, ఫిషింగ్ హార్బర్‌లలో వివిధ స్థాయిల్లో పనుల కాంట్రాక్టులను దక్కించుకుంటున్న సంగతి తెలిసిందే. తీర భద్రత, రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డిసిఐ రక్షణ రంగంతో కలిసి సేవలను అందిస్తోంది. సముద్ర మార్గంలో జరిగే ఎగుమతి, దిగుమతుల భద్రత, నేవిగేషనల్ ఛానెల్స్‌ను అభివృద్ధి చేసేందుకు డిసిఐ కాంట్రాక్టులను దక్కించుకుంటూ ఆర్థిక పరిపుష్టిని పొందగలుగుతోంది. ఈ మేరకు గురువారం డిసిఐ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ కెప్టెన్ ఎస్.దివాకర్ ఈ కాంట్రాక్టుపై సంతకం చేశారు. ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా టెక్నికల్ మెంబర్ అషుతోష్ గౌతమ్ సమక్షంలో ఈ చారిత్రాత్మక ఒప్పందం కుదిరింది. ఇరువురూ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం డవలప్‌మెంట్, మెయింటెనెన్స్ ఫెయిర్ వే 32 వెడల్పు, 2 మీటర్ల లోతును మూడేళ్లలో తవ్వేందుకు ఒప్పందం కుదిరింది. చానల్ మార్కింగ్, రివర్ ట్రైనింగ్, బాండల్లింగ్.. వీటన్నింటినీ డిసిఐ చేపట్టనుంది. వెస్సెల్స్ రాకపోకలకు వీలుగా నార్త్ ఈస్టర్న్ రీజియన్‌లో పనులు చేపట్టనుంది. దీని ప్రకారం ధన్‌సిరి నదిలో నుమలిగర్ జెట్టీ నుంచి ధన్‌సిరి వరకూ 35 కిలోమీటర్లు, బారక్ రివర్ భంగా నుంచి బాదార్‌పూర్ వరకూ 10.5 కిలోమీటర్లు, కొపిలి రివర్ వద్ద బ్రహ్మపుత్ర నుంచి ధూబ్రి, గౌహతి (నార్త్) వరకూ 35 కిలోమీటర్ల మేర పనులు చేపట్టనుంది. ఈ తరహా పనుల ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరంలో డిసిఐ రూ.1000 కోట్ల టర్నోవర్ మైలురాయిని దాటేందుకు ప్రయత్నాలు చేపట్టింది.

లోపలి పేజీల్లో..

అందరికీ నైపుణ్య విద్య	సెజ్ కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ర్యాలీ	10న సీ హార్స్ జంక్షన్ వద్ద ధర్నా	నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణం

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు నష్టం



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం

స్టీల్‌ప్లాంట్‌తో సహా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తే రిజర్వేషన్లు ఉండవని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకటరెడ్డి అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు గురువారం నాటికి 672వ రోజుకు చేరాయి. దీక్షల్లో మున్సిపల్ వర్కర్స్ కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లు ఉన్నందునే ప్రభుత్వ రంగ సంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి వంటి దళిత సామాజిక తరగతుల వారు ఉపాధి పొందారని చెప్పారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఉండవన్నారు. ఈ నేపథ్యంలో ప్రైవేటీకరణను దళితులు, గిరిజనులు, బిసిలు, మైనారిటీలు తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వివిధ రకాల పన్నులు, డివిడెంట్లు రూపంలో వేల కోట్ల ఆదాయం లభిస్తుందన్నారు. ప్రైవేటీకరణ జరిగితే ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు ఈ ఆదాయాన్ని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నందునే విశాఖపట్నం మహానగరంగా అభివృద్ధి చెందిందన్నారు. అందుకే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. దీక్షల్లో యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎంవి.ప్రసాదరావు, కార్యదర్శి పి.అప్పలరాజు, నాయుడు, ఇ.ఆదినారాయణ పాల్గొన్నారు.

సమరయాత్రకు అపూర్వ స్పందన

- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకు విశాఖ, అనకాపల్లిల్లో సభలు
- భారీగా తరలొచ్చిన యువత
- మోసకారి పాలకులకు బుద్ధి చెప్పాలని నేతల పిలుపు



పూలు జల్లి స్వాగతం పలుకుతున్న విద్యార్థులు



విశాఖ సభలో మాట్లాడుతున్న చలసాని, చిత్రంలో నర్సింగరావు, రమాప్రభ తదితరులు

ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు హిందూపురం నుంచి ఇచ్ఛావరం వరకూ చేపట్టిన సమరయాత్ర గురువారం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల్లో పర్యటించింది. అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద, విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభలు జరిగాయి. వందలాది మంది విద్యార్థులు, యువతీ యువకులు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి తరలొచ్చి ఆయాచోట్ల పూలు జల్లి యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఆయా సభల్లో నేతలు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ఇస్తామని రాష్ట్ర ప్రజలను మోసగించిన పాలకులకు రానున్న కాలంలో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. హోదాపైనే యువత భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు.

కలెక్టరేట్ (విశాఖపట్నం) : విశాఖ నగరంలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బహిరంగ సభ జరిగింది. డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు యుఎస్ఎన్.రాజు అధ్యక్షత వహించారు. ఈ సభలో ప్రత్యేక హోదా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మోసాన్ని ప్రశ్నించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిద్రపోతోందని మండిపడ్డారు. అందుకే ప్రత్యేక హోదా సాధన, విభజన హామీల అమలు కోసం, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల ప్రత్యేక ప్యాకేజీల కోసం పోరాటం చేపట్టామని తెలిపారు. సిఐటియు రాష్ట్ర మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

తప్పుల తడక

పోలింగ్ బూత్ 172లో సీరియల్ నెంబరు 622, పోలింగ్ బూత్ 184లో సీరియల్ నెంబరు 219, 220లో నిరక్ష్యరాస్యులు ఓటర్లుగా నమోదయ్యారు. ఇలా ఐదు, పది, జిఎన్ఎం, డిప్లొమా, పియుసి, ఐటిఐ చదువుకున్న వారిని కూడా ఓటర్లుగా చేర్చి, అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో పలువురు విస్మయం చెందుతున్నారు. ఓటరు జాబితాలో అనర్హులను, ఒకటి కంటే ఎక్కువసార్లు నమోదైన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, ఓటర్లకు సమీప బూత్‌లో ఓటు వేసుకొనేలా చర్యలు తీసుకోవాలని లోకనాథం కోరారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

సమరయాత్రకు అపూర్వ స్పందన

ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ గుంటూరు, విజయవాడ, విజయనగరం పట్టణాల కంటే విశాఖపట్నం చిన్నదైనప్పటికీ వాటన్నింటినీ మించి మహానగరంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ రంగ సంస్థలు కారణమని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సహా ప్రభుత్వ రంగ సంస్థలు విశాఖకు రావడానికి ఆనాడు విద్యార్థులు చేసిన పోరాటాలే కారణమని చెప్పారు. స్టీల్‌ప్లాంట్ సాధన కోసం 32 మంది ఆత్మ బలిదానం చేశారని గుర్తు చేశారు. అటువంటి స్టీల్‌ప్లాంట్‌ను ఇప్పుడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మివేసేందుకు చూస్తోందన్నారు. రెండేళ్లుగా తాము చేసిన పోరాటం ఫలితంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని తెలిపారు. ప్రత్యేక హోదా వస్తే రక్షణ రంగంలో పది వేల ఉద్యోగాలు వస్తాయని, స్టీల్‌ప్లాంట్, రైల్వే వగైరా వాటిలో వేల సంఖ్యలో ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటు కావలసిన రైల్వే జోన్‌ను ఇంతవరకూ ఇవ్వలేదన్నారు. దుర్మార్గపు బిజెపి ప్రభుత్వాన్ని పోరాటాల ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలని, విశాఖకు రైల్వే జోన్ ఇవ్వాలని, సెంట్రల్ యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్, కార్యదర్శి అశోక్, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, తదితరులు మాట్లాడారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ప్రొఫెసర్ జాన్, ప్రొఫెసర్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలోని ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద బహిరంగ సభ జరిగింది. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటికైనా ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుంటే పెద్ద ఎత్తున నిరుద్యోగ యువత, విద్యార్థులు ఉద్యమిస్తారని హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ విద్యార్థి, యువత ఉపాధి పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము మాట్లాడుతూ ఉత్తరాంధ్రలోని పెట్రోలియం, గిరిజన యూనివర్సిటీలకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లిలో విద్యాలయాల్లో తగు సదుపాయాలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఎస్‌వి.నాయుడు, ఎస్.రమణ, వియ్యపు రాజు అధ్యక్షతన బహిరంగ సభ జరగ్గా విద్యార్థి, యువజన సంఘాల నాయకులతోపాటు అల్లూరి సీతారామరాజు వారసులు సత్యనారాయణ రాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : సమరయాత్ర బృందం కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న ఉక్కు పరిరక్షణ దీక్షా శిబిరాన్ని సందర్శించింది. 721 రోజులుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతుంటే మోడీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యమ నాయకులు కూడా బస్సు యాత్ర నిర్వహించాలని చలసాని శ్రీనివాస్ సూచించారు.

సమరయాత్రను అడ్డుకున్న ఎయు యాజమాన్యం

ఎంవిపి.కాలనీ : సమరయాత్ర ఆంధ్ర యూనివర్సిటీలోకి ప్రవేశించకుండా నిరంకుశ పద్ధతిలో ఎయు యాజమాన్యం అడ్డుకుంది. దీంతో వర్సిటీ ముఖ ద్వారం ముందే యాత్రా బృందం నిరసనకు దిగింది. ఈ సందర్భంగా చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లోకీ వెళ్లిన తమ యాత్రను ఎయులోకి అనుమతించకపోవడం దుర్మార్గమన్నారు. వీసీ ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వ్యతిరేకమా, అనుకూలమా ? అన్నది వెంటనే చెప్పాలన్నారు. హైకోర్టు ఆర్డర్ చూపించినా అనుమతి ఇవ్వకపోవడంతో యూనివర్సిటీ యాజమాన్యం తీరుపై విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.



ఎయు వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

బడ్జెట్‌లో ఎస్‌సి, ఎస్‌టిలకు మొండి చెయ్యి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీలకు మొండి చేయి చూపారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.చిరంజీవి, ఎం.సుబ్బన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం దళితుల అభ్యున్నతి కోసం రూ.1819.52 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.976.86 కోట్లకు తగ్గించిందన్నారు. ఈ చర్య దళిత, గిరిజనుల అభివృద్ధికి ఆటంకమని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : 11 కెవి ఫీడర్ అక్కయ్యపాలెం సెక్షన్‌లో శుక్రవారం విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నామని, దీంతో పటుచోట్ల ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని జోన్ 1 ఇఇ ఆపరేషన్ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలోని ఎన్‌జిఒ కాలనీ, కెడబ్ల్యు భవన్, జివిఎంసి పంపు హౌస్, జివిఎంసి స్కూల్స్, హెల్త్ సెంటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రకృతి వనరులను కాపాడుకుందాం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రకృతి వనరులను కాపాడుకోవాలని మెడగాస్కర్‌కు చెందిన సోషల్ వర్క్ స్టూడెంట్ కసాండ్ర పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఎంవిపి.కాలనీలోని సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీలో గ్రీన్ క్లైమేట్ టీమ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మట్లాడారు. ప్రస్తుతం ప్రకృతి వనరులను కాపాడుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం మాట్లాడుతూ ప్రకృతితో మమేకమై జీవరాశులు, మనిషి జీవించాలని అన్నారు. కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ స్వప్న, ప్రతినిధులు డాక్టర్ జి.విజయలక్ష్మి, అమృత, మురళి కిషోర్ పాల్గొన్నారు.

అందరికీ నైపుణ్య విద్య

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రానున్న కాలంలో అందరికీ నైపుణ్య విద్యను అందించనున్నట్టు ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చీఫ్ కో-ఆర్డినేటింగ్ ఆఫీసర్ బుద్ధ చంద్రశేఖర్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అప్రెంటిషిప్‌పై రెండు రోజుల జాతీయ అవగాహన సదస్సు గురువారం ఉదయం కంచరపాలెంలోని ప్రభుత్వ కళాశాలలో ప్రారంభమైంది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 300కు పైగా పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వ విధానాలను స్వాగతిస్తూ విద్యార్థులకు అప్రెంటిషిప్‌కు అవకాశం కల్పిస్తున్నాయని తెలిపారు. కరోనా కాలంలోనూ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ముందుందని అన్నారు. ప్రభుత్వమే డబ్బులు చెల్లిస్తూ సామర్థ్యం ఉన్న ఉద్యోగులను తయారు చేసుకునే అవకాశం అప్రెంటిషిప్ ద్వారా లభిస్తుందన్నారు. భవిష్యత్తులో నైపుణ్య విద్యకు ప్రాధాన్యత పెరగనుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఎస్‌డి తెలుగు రాష్ట్రాల ప్రాంతీయ సంచాలకులు కె.శ్రీనివాసరావు, ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ అజయ్ రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సుబ్బిరెడ్డి, జన శిక్షణ సంస్థ చైర్మన్ రామరాజు, గాజువాక ఐటిఐ ప్రిన్సిపాల్ బాలాజీ, ఓల్డ్ ఐటిఐ ప్రిన్సిపల్ బిఎస్‌బి.ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

లక్ష్మీనారాయణను కలిసిన మైత్రి డైరెక్టర్లు

ప్రజాశక్తి - విశాఖపట్నం : జెడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు, విశ్రాంత సిబిఐ జాయింట్ డైరెక్టర్ వివి.లక్ష్మీనారాయణను మైత్రీ మీడియా సంస్థ డైరెక్టర్లు అవనాపు విక్రమ్, సాయి నకుల్ వర్మ విశాఖలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుత సమాజ పరిస్థితులు, భవిష్యత్తు ఉత్తరాంధ్ర తీరుతెన్నులపై వారి మధ్య చర్చ సాగింది. అనంతరం ఎంఎం న్యూస్ విశాఖ జిల్లాలో ప్రారంభించిన ముఖాముఖి కార్యక్రమం మొదటి ఎపిసోడ్‌ను లక్ష్మీనారాయణతో నిర్వహించారు. వారిని ఆయన అభినందించారు.



లక్ష్మీనారాయణను కలిసిన విక్రమ్

ఆక్రమణలు తగవు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఫుట్‌పాత్‌లు, గ్రీన్‌బెల్టుల ఆక్రమణలు తగవంటూ జివిఎంసి జోన్ - 3 పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ఆధ్వర్యంలో గురువారం ఎంవిపి కాలనీలోని ఎఎస్ రాజా సర్కిల్ నుంచి ఎంవిపి డబుల్ రోడ్డు వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారుల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించొద్దని, నడకదారులకు ఇబ్బంది కలిగించవద్దని, రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేయెుద్దని నినదించారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిపిఎస్ తేజ, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సిఎంతో శ్రీధర్ రెడ్డి భేటీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డిని సిఎం కార్యాలయంలో గురు వారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఎపి ప్రభుత్వ సలహాదారు (స్కిల్ ట్రైనింగ్ అండ్ జాబ్ ఫెయిర్స్) గాది శ్రీధర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపానన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న జాబ్ మేళాలు, భవిష్యత్తులో జరిగే జాబ్ మేళాలను ముఖ్యమంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు.



సిఎంను కలిసిన శ్రీధర్ రెడ్డి

ట్యాబ్‌లు ఇళ్లకే పరిమితం

- సమస్యగా మారిన భద్రత
- నెరవేరని లక్ష్యం

ప్రజాశక్తి -భీమునిపట్నం : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులకు అందజేసిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల వినియోగం ఇళ్లకే పరిమితమవుతున్నాయి. దీంతో లక్ష్యం నెరవేరనట్టే నని చెప్పొచ్చు. ఒక్కో విద్యార్థికి రూ.15,500 విలువైన బైజూస్ కంటెంట్‌తో కూడిన రూ.16,500 విలువైన ట్యాబ్‌ను ఉచితంగా అందించారు. మండలంలోని 30 ఎయిడెడ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 1308 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

ఉపయుక్తం అంటూనే వినియోగంలో నిరాసక్తత

మూర్తానుభవాలు కలిగించుట (పాఠాలు దృశ్య రూపంలో చూపించుట), ప్రత్యేకంగా నోట్స్, విద్యార్థులకు సులభ శైలిలో, వినూత్న తరహాలో అర్థమయ్యేలా పాఠాల బోధన వీటి ఉద్దేశం. ఇవి ఉపయుక్తం అంటూనే, ఎందుకనో పాఠశాలకు ట్యాబ్‌లు తేవడం లేదు. పాఠశాలకు తెస్తే వాటి భద్రత సమస్యగా మారుతుందని, ఛార్జింగ్ పెట్టడానికి అవకాశం లేదని పలువురు విద్యార్థులు చెప్పారు.

పాత పద్ధతిలోనే బోధన...

ట్యాబ్‌లు ఇళ్ళ వద్దనే ఉంచేయడంతో పాఠాల బోధన పాత పద్ధతిలోనే జరుగుతోంది. నోట్స్‌లు, పాఠ్య పుస్తకాలు పట్టుకుని ఎన్ఎస్, పిఎస్, గణితం ఉపాధ్యాయులు పాఠాలు చెబుతున్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ మినహా సామాన్య, సాంఘిక, భౌతిక శాస్త్రం, గణితం పాఠ్యాంశాలు బైజూస్ కంటెంట్ ద్వారా బోధించేలా ట్యాబ్‌లో సాంకేతికతను జోడించి ఇమిడ్చారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఈ తరహా బోధన అనివార్యం. అయితే ట్యాబ్‌లు ఆచరణలో సర్ఫలితాలను ఇవ్వాల్సి ఉంది.



ట్యాబ్‌లు లేకుండా పాత పద్ధతిలోనే పాఠశాలకు హాజరైన విద్యార్థులు



ప్రారంభంలో ట్యాబ్‌లతో హాజరైన విద్యార్థులు

అంతరాలను సరిదిద్దేది ఇలానా?

ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ చదువులు, డిజిటల్ విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టామని ట్యాబ్‌ల పంపిణీ సందర్భంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. చదువుల్లో సమానత్వం తెచ్చి ఆర్థిక అసమానతలు అధిగమించేందుకు, అంతరాలను సరి దిద్దేందుకు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తున్నట్లు పేర్కొన్నారు. ట్యాబుల్లో బైజూస్ కంటెంట్ అమర్చడంపై సిపిఎం ఆనాడే ప్రభుత్వ తీరుపై మండి పడింది. బైజూస్ నాణ్యతకుఎలాంటి సాధికారత లేదని, ఇది దివాళా తీసిన సంస్థని స్పష్టం చేసింది. ప్రభుత్వ విద్యపై బైజూస్ పెత్తనం కూడదని సిపిఎం పేర్కొంది.

ఫలితమివ్వని ట్యాబ్‌లు

చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 92 మంది 8వ తరగతి విద్యార్థులు ఉన్నారు. వారితోపాటు ఉపాధ్యాయులకు 10 ట్యాబ్ లు ఇచ్చారు. ఒకరిద్దరు విద్యార్థులు మినహా ఎక్కువ శాతం విద్యార్థులు ట్యాబ్‌లు తేలేదు. కారణం ఏంటని అడగ్గా భద్రత కష్టమని, ట్యాబ్‌లు అందని 6, 7, 9, 10 తరగతుల విద్యార్థుల్లో కొందరు ట్యాబ్ లు ఇవ్వాలని ఒత్తిడి తేవడం లాంటి కారణాలతో తేవడం లేదని విద్యార్థులు అంటున్నారు. ఈ తరహా సమస్యలు దాదాపు అన్ని పాఠశాలల్లోనూ ఉన్నాయి.

ఒక్కో సారి గూగుల్ రావడం లేదు

సెట్టింగ్స్, వైఫై మెసేజ్ లు, బైజూస్ కంటెంట్ సరిగా ఉంటే ఒక్కో సారి గూగుల్ రావడం లేదు. పాఠాల బోధనలోను, నోట్స్ బాగానే ఉంది. ఒక విధంగా చెప్పాలంటే ఉపయుక్తంగానే ఉంది.

షణ్ముఖ శ్రీనివాస్
8వ తరగతి విద్యార్థి

అవగాహన కల్పించారు

ట్యాబ్ వినియోగంపై ఉపాధ్యాయులు ఇప్పటికే అవగాహన కల్పించారు. పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉంటే డిజిటల్ బోధన బాగుంటుంది. బైజూస్ కంటెంట్‌లో సోషల్ నోట్స్ లేదు.

జీరు వెంకటకీర్తన
8వ తరగతి విద్యార్థి

సులభ శైలిలో బోధన



ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధన అత్యంత సులభ శైలిలో ఉంటుంది. ప్రస్తుత విద్యా విధానంలో డిజిటల్ వినియోగం అనివార్యం.

పి.నాగేశ్వరరావు
ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు

నేరాలు ఘోరాలు

మహిళపై కత్తితో దాడి

- పురుగుల మందు తాగి నిందితుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-రోలుగుంట: రోలుగుంట మండలం కంచుగుమ్మల గ్రామంలో గురువారం ఉదయం ఐదు గంటల సమయంలో గేదెల కుమారి అనే మహిళపై బిజిపాలెం గ్రామానికి చెందిన పూడి రమణ అనే వ్యక్తి దాడి చేసినట్లు రోలుగుంట ఎస్ఐ నాగకార్తీక్ తెలిపారు. వేరే కేసులో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలై వచ్చిన రమణ, గురువారం కంచుగుమ్మల గ్రామానికి వచ్చి ఉదయం 5 గంటల సమయంలో తన కోరిక తీర్చాలని కుమారిని ఒత్తిడి చేయగా, ఇష్టం లేక ఆమె వ్యతిరేకించడంతో కత్తితో కుడి మెడ మీద దాడి చేసి గాయపరిచాడని దీంతో బాధితురాలిని కెజిహెచ్‌కు తరలించినట్లు తెలిపారు. కుమారిపై దాడి అనంతరం రమణ విషం తీసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. అయితే ఇద్దరికి ప్రాణాప్రాయం తప్పిందన్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుమారి వద్ద జిల్లా ఎస్‌పి ఎంఎస్.గౌతమిశాలి వెళ్లి సంఘటను సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.



'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'లో పాదయాత్ర చేస్తున్న వెలగపూడి

కొండవాలు ప్రాంతంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి12వ వార్డు పరిధి కొండవాలు ప్రాంతంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని సింహగిరి కాలనీ నుంచి దీనదయాల్‌పురం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం భూముల్లో నివాసముండే వారికి కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ వైఖరి, నిత్యావసర ధరలు పెంపు, విద్యుత్ ఛార్జీలు, ఇంటి పన్ను, చెత్త పన్ను, రవాణా ఛార్జీలు పెంపు వంటి సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యే ముందు ఏకరువు పెట్టారు. ఈ కార్యక్రమంలో 9, 10, 11, 12, 13 వార్డుల తెలుగుదేశం పార్టీ నాయకులు బుడుమూరు గోవిందు, గాడి సత్యం, ఒమ్మి పోలారావు, బాలస్వామి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎండాడ విద్యార్థులు

ప్రజాశక్తి -మధురవాడ : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ క్రీడా పోటీలకు ఎండాడ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె.శ్రీనివాసరావు తెలిపారు. డిసెంబర్ 16వ తేదీన ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన పోటీల్లో ఎండాడ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను కనపరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఏలూరులోని పెదవేగి రెసిడెన్సియల్ పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణరావు తెలిపారు.

పలు పాఠశాలలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని జివిఎంసి పరిధిలో ఉన్న పలు ప్రభుత్వ పాఠశాలలను డిఇఒ ఎల్.చంద్రకళ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. మండలంలోని తాళ్లవలస జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. ఒకటో వార్డు పరిధిలోని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలను సందర్శించి సిఆర్ యాప్ పరిశీలించారు. విద్యార్థుల సాధన పుస్తకాలను పరిశీలించి, సరిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. డిఇఒ వెంట చిట్టివలస జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పొట్నూరు మురళీ మోహన్ రావు, ప్రభుత్వ డైట్ అధ్యాపకులు జి.రవి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం రెడ్డిపల్లి అప్పలరాజు తదితరులు ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను గురువారం గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు ఆ రాష్ట్ర పాటు పర్యాటక శాఖ మంత్రి కూడా ఉన్నారు. శ్రీశైల భ్రమరాంబ దేవాలయం ఇఒ ఎస్.లవన్న దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణచేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు.

దంత సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి పిఎన్ఎం ఉన్నత పాఠశాల విద్యార్థులకు దంత వైద్యంపై సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల వైద్యులు గురువారం, అవగాహన కల్పించారు. పలువురికి దంత పరీక్షలు జరిపారు. దంత సంబంధిత సమస్యలు రాకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు వివరించారు. దంత వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వంశీకృష్ణా రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ తారకేష్, వైద్యులు విన్నీ, శ్రావణి, సనా షేక్, మనో హర్, సూర్య వైద్య పరీక్షలు చేశారు. హెచ్ఎం తిరుమల శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ శిల్పారామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. శిల్పారామం జాతరలో రూ.4 లక్షల జివిఎంసి నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. శిల్పారామంలో ప్రైవేటు సంస్థతో రెండేళ్ల కాలపరిమితితో ఒప్పందం కుదుర్చుకొని రూ.2.80 కోట్లతో ఏర్పాటుచేసిన వాటర్ వరల్డ్ పార్క్‌నూ ఆయన ప్రారంభించారు. శిల్పారామంలో యోగ చేసుకునేందుకు వీలుగా దివీస్ సిఎస్ఆర్ నిధులు రూ.16 లక్షలతో యోగ వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం విశాఖను పరిపాలన రాజధానిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించినందుకు ఆయన చిత్ర పటానికి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యాన పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ టు జోనల్ కమిషనర్ కె.కనకమహలక్ష్మి, వాటర్ వరల్డ్ సంస్థ మేనేజింగ్ చైర్మన్ జానకి రమేష్ బెహరా, దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ సురేష్, జాతర ఎఒ విశ్వనాథ్‌రెడ్డి, 6, 7 వార్డుల వైసిపి అధ్యక్షులు బొట్టా అప్పలరాజు, పోతిన శ్రీనివాస్, నాయకులు ఇఎన్ఎస్ చంద్రరావు, అల్లాడ లింగేశ్వరరావు, గాదె రోశి, పిల్లా కృష్ణమూర్తిపాత్రుడు, పిల్లా సూరిబాబు, పిల్లా రమణ, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సియ్యాద్రి కనకరాజు, కురిటి లోహిత్, పోతిన మూర్తిబాబు, పోతిన యల్లాజి, జగ్గుపిల్లి నరేష్, జగ్గుపిల్లి సాయి, అల్లాడ లింగేగేశ్వర రావు, కోండపిల్లి వరలక్ష్మి, ముందుండి రాజేశ్వరి, పోతిన సురేష్, రాజంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్ ప్రారంభంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మంగమ్మ

7వ వార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో 7వ వార్డు సమస్యలపై ఆ వార్డు కార్పొరేటర్ పిళ్ళా మంగమ్మ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. వార్డు పరిధిలోని రహదారులు, డ్రెయినేజీ, తాగు నీరు, వీధి లైట్లు, పార్కుల సమస్యలను కమిషనర్‌కు వివరించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కోరారు.



వర్క్స్ సిజిఎం మొహంతిని సత్కరిస్తున్న అయోధ్యరామ్ తదితరులు

పూర్తిస్థాయి స్టీల్ ఉత్పత్తి చేయాలి

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయాలని స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా సిజిఎం (వర్క్స్) బాధ్యతలు చేపట్టిన బికె మొహంతిని ఆయన కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడానికి కార్మిక వర్గం సిద్ధంగా ఉందన్నారు. బిఎఫ్-3ని తక్షణం ప్రారంభించడం ద్వారా పూర్తిస్థాయి ఉత్పత్తితో పాటు ఆర్థికంగా అభివృద్ధి ఉంటుందని వివరించారు. ఆ దిశగా యాజమాన్యం చర్యలు చేపట్టాలని కోరారు.

స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ, ఉత్పత్తిలో కార్మికులు మరింత అంకితభావంతో పనిచేయడం కోసం నూతన వేతనాలను అమలు చేయడంలో యాజమాన్య వైఖరిని మార్చుకోవాలని కోరారు. ఉత్పత్తికి అనుగుణంగా కార్మికులకు ప్రోత్సాహకాలను అందించడం కోసం కృషి జరగాలన్నారు. వీటిని యాజమాన్యం పరిష్కరించే దిశగా ప్రయత్నించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు బి.అప్పారావు, శ్రీనివాసరాజు, గంగాధర్, టివికె.రాజు, బిఎన్.మధుసూదన్, సత్యనారాయణ, మురళి, డిఎస్ఆర్‌సి.మూర్తి, మొహిద్దీన్, దుర్గాప్రసాద్, ముత్యాలనాయుడు, దేముడు నాయుడు, శ్రీనివాసులురెడ్డి, వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డు పరిధి ఆర్‌కె.పురం సెయింట్ ఆన్స్ స్కూల్ రహదారిలో రూ.19 లక్షలతో బీటీ రోడ్డు పనులకు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం సచివాలయాలు, ప్రైమరీ స్కూలును, ఇండస్ట్రియల్ కాలనీ 1, 2 సచివాలయాలను సందర్శించారు. ప్రజల సమస్యలపై సచివాలయ సిబ్బందితో చర్చించారు. ఇండస్ట్రియల్ కాలనీ ప్రైమరీ స్కూల్లో ఇంగ్లీష్ మీడియం బోధనపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు పివి.సురేష్, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, వార్డు వైసిపి ఇన్‌ఛార్జి దాడిసత్యనారాయణ, నాయకులు కొల్లి నూకరెడ్డి, పిలక రామ్మోహన్‌రెడ్డి, సోమధుల సురేష్, ఎఇ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆనంద్‌కుమార్

11న ఆర్ అండ్ బి జిల్లా అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సీతమ్మధార : రహదారులు, భవనముల విశాఖ జిల్లా అసోసియేషన్ కార్యవర్గాన్ని ఈ నెల 11వ తేదీన ఏర్పాటుచేయనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెల్లపురెడ్డి జగన్మోహన్‌రావు తెలిపారు. ప్రతి ఉద్యోగీ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

ఏప్రిల్ 3 నుంచి ఓపెన్ స్కూలు పరీక్షలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు ఓపెన్ స్కూలు పది, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్స్ ఏప్రిల్ 18 నుంచి 23వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్ష ఫీజును ఫిబ్రవరి 1 నుంచి మార్చి 7వ వరకు చెల్లించేందుకు గడువు ఉన్నట్టు తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఫిబ్రవరి 15 వరకు, అపరాధ రుసుముతో మార్చి 7 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణం

- పెరిగిన సామగ్రి ధరలు
- రూ.1.80 లక్షలు ఎటూ చాలదంటున్న లబ్ధిదారులు..
- నిర్దేశించిన లక్ష్యాలను చేరేందుకు హౌసింగ్ అధికారుల ఆపసోపాలు
- రూ.35 వేలు చెల్లించాలంటూ పట్టణ ప్రాంత లబ్ధిదారులపై ఒత్తిడి

ప్రజాశక్తి -భీమునిపట్నం : అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రారంభమైన జగనన్న ఇళ్ల నిర్మాణం నత్త నడకన సాగుతోంది. పట్టణ ప్రాంతంలో ఉన్న వారికి గ్రామీణ ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. జివిఎంసి పరిధిలో 4 వార్డులుండగా 3 వార్డుల్లో 2,569 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ ప్లింత్ భీమ్ దశలో 1528 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటి వరకు ఒక్క ఇంటి నిర్మాణమూ పూర్తి కాలేదు.

48 చదరపు గజాల విస్తీర్ణంలో 17 అడుగుల పొడవు, 16.50 అడుగుల వెడల్పుతో ఇంటి నిర్మాణం చేపట్టాలి. బాత్ రూమ్, వంట గది, మరుగు దొడ్డి, హాల్, వరండా నిర్మించాలి. జివిఎంసి భీమిలి జోన్ పరిధిలో (4వ వార్డు మినహా) ఉన్న 2,569 మంది లబ్ధిదారులకు ఆనందపురం మండలం గొట్టిపల్లి, జగన్నాథపురం, బాకూరుపాలెంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. గొట్టిపల్లిలో 15 ఎకరాలు, జగన్నాథపురం, బాకూరు పాలెంలో 70.40 ఎకరాల విస్తీర్ణంలో లే-అవుట్లు వేశారు.

రూ 35 వేలు చెల్లించాలని ఒత్తిడి

రూ.35వేలు చెల్లించాలంటూ పట్టణ ప్రాంత లబ్ధిదారులపై సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది తీవ్రంగా ఒత్తిడి పెంచుతున్నారు. లబ్ధిదారులతో డబ్బులు కట్టించే బాధ్యత మీదే నంటూ వార్డు వాలంటీర్లపై కూడా సచివాలయ సిబ్బంది ఒత్తిడి పెంచుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకే ఒత్తిడి అన్నది వేరేగా చెప్పనక్కరలేదు. ఎందుకు కట్టాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తే ఇంటి స్థలం, పట్టా రద్దు అవుతుందని సచివాలయ ఉద్యోగులు భయ పెడుతున్నారని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

కాంట్రాక్టర్లకు అప్పగింత..

ఆనందపురం మండలం గొట్టిపల్లిలో జిఎన్ఆర్ కనస్ట్రక్షన్‌కు, జగన్నాథపురం, బాకూరు పాలెంలో జెఎన్ఆర్ కనస్ట్రక్షన్‌కు ఇళ్ల నిర్మాణ బాధ్యతను ప్రభుత్వమే అప్పగించింది. వీరంతా కాంట్రాక్టర్లు. జివిఎంసి, భీమిలి జోన్ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఈ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించింది. ప్రభుత్వం ఇచ్చిన రూ 1.80లక్షలతో పాటు రూ.35 వేలు కూడా కాంట్రాక్టర్లకే చేరుతుంది. రూ.35 వేలతో ప్లంబింగ్, ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులకు వినియోగిస్తారని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు.

2,193 మంజూరు.. 206 నిర్మాణాల పూర్తి

భీమిలి మండలంలో (16 పంచాయితీలు, జివిఎంసి 4వ వార్డులో ఉన్న 5 విలీన పంచాయితీలు అంటే చేపలుప్పాడ, కె.నగరపాలెం, కాపులుప్పాడ, నిడిగట్టు, జెవి.అగ్రహారం)లో 2,193 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ కేవలం 206 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇక్కడి ఇంటి నిర్మాణానికి రూ.1.50లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మరో రూ.30 వేలు చెల్లిస్తుంది. ఇంటి లబ్ధిదారుడిని కూలీగా చేర్చి ఉపాధి పథకం కింద డబ్బులు ఇస్తుంది. గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి రూ.287 విలువ గల ఒపిసి బ్రాండ్, రూ.277 విలువ గల పిపిసి బ్రాండ్ గల 80 సిమెంట్ బస్తాలు, 475 కిలోల ఇనుము, 20 ఎంటిల ఇసుక ప్రభుత్వమే దశల వారీగా లబ్ధిదారునికి ఇస్తుంది.



జగన్నాథపురంలో పునాదుల దశలోనే ఉన్న ఇళ్ల నిర్మాణాలు

పునాదులకే చాలవు..

ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు పునాదులు వేసేందుకే సరిపోవట్లేదని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అధిక వడ్డీలకు అప్పుచేసి ఇంటి నిర్మాణం చేపట్టడం కష్టమే అని అంటున్నారు. అందుకనే సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదని చెప్పొచ్చు.


త్వరిత గతిన ఇళ్ల నిర్మాణం

జివిఎంసి భీమిలి జోన్ పరిధిలో 3 వార్డుల్లో (4వ వార్డు మినహా) 2,569 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 1528 ప్లింత్ భీమ్ దశలో ఉన్నాయి. వీటి నిర్మాణాన్ని ప్రభుత్వమే లబ్ధిదారుల అనుమతి తీసుకుని కాంట్రాక్టర్లకు అప్పగించింది. త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తాం

దువ్వు శేషుబాబు
అసిస్టెంట్ ఇంజినీర్
హౌసింగ్, అర్బన్ ఏరియా

శనివారం హౌసింగ్ డే

ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించేందుకు ప్రతి శనివారమూ హౌసింగ్ డే పేరిట లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతున్నాం. వారి ఇబ్బందులను తెలుసుకుంటున్నాం. సొంతింటి కళ నెరవేరేందుకు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా కృషి జరుగుతోంది.



ఎం.హుస్సేన్
అసిస్టెంట్ ఇంజనీర్
హౌసింగ్, భీమిలి మండలం

ఎపిఐఐసి స్థలం కబ్జా

అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ నిర్మాణం



ఎపిఐఐసి స్థలంలో ఏర్పాటైన కిక్ బార్ అండ్ రెస్టారెంట్

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లోని ఎపిఐఐసి స్థలం కబ్జాకు గురైంది. ఆ స్థలంలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుచేసిన మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. జివిఎంసి 88వ వార్డు పరిధి జగ్గరాజుపేటకు ఆనుకొని ఉన్న సర్వేనెంబర్ 67/10 ఎపిఐఐసి స్థలంలో కిక్ రెస్టారెంట్ అండ్ బార్ ఏర్పాటుచేశారు. ఈ మొత్తం స్థలం ఎపిఐఐసికి చెందినదైనప్పటికీ పరిరక్షించాల్సిన అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. జివిఎంసి జోన్ అధికారులు వేరే డోర్ నెంబర్ పేరుతో ట్రేడ్ లైసెన్స్ కూడా మంజూరు చేశారు. ఎపిఐఐసికి చెందిన అధికారుల్లో ఎక్కువ మంది ఈ స్థలానికి సమీపంలోనే ఉన్నారు. అయినా సరే పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి ఈ స్థలాన్ని కబ్జా నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఐలా కమిషనర్ సూర్యనారాయణను వివరణ కోరగా దర్యాప్తు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రేపటి నుంచి తుంగ్లాం రైల్వే గేట్ మూసివేత


ప్రజాశక్తి -గాజువాక : గాజువాక మండల పరిధి తుంగ్లాం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ కె.రమేష్‌బాబు గురువారం ప్రకటన విడుదలచేశారు. ఎస్పీ -5 వద్ద ట్రాక్ పనులు, రోడ్డు మరమ్మత్తు పనులు కారణంగా ఈ నెల 4 నుంచి 10వ తేదీ వరకు పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ రహదారిలో ప్రయాణించే ఆటోనగర్, వడ్లపూడి, తుంగలం వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.

24వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి టిపిటి కాలనీ, పి అండ్ టి కాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెకె.రాజు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు రాయుడు శ్రీను, నూకరాజు, గుడ్డల అశోక్‌రెడ్డి, మురళీకృష్ణారెడ్డి, సమ్మెట్ల వెంకటేష్, అధికారులు పాల్గొన్నారు.

కామెర్లు బేబీకి కిమ్స్‌లో రక్తమార్పిడి

ప్రజాశక్తి -గాజువాక : పుట్టుకతోనే తీవ్రమైన కామెర్లు రావడంతో షీలానగర్‌లోని కిమ్స్ కడల్స్ వైద్యులు రక్త మార్పిడి చేసి పాపను కాపాడారు. నియోనటాలజీ విభాగం డాక్టర్ నిఖిల్ కథనం ప్రకారం... గాజువాకకు చెందిన రియానా బేగం ప్రభుత్వాసుపత్రిలో పాపకు జన్మనిచ్చారు. తల్లి రక్తం ఓ నెగటివ్ గ్రూపు, బిడ్డ రక్తం ఓ పాజిటివ్ గ్రూపుగా ఉన్నాయి. ఈ కారణంగా పుట్టిన పాపకు తీవ్రమైన కామెర్లు వచ్చాయి. బైలురూబిన్ 36 మిల్లీగ్రాములు నమోదయింది. ఇది చాలా ఎక్కువ కావడంతో మెదడుపై తీవ్రమైన ప్రభావం చూపించింది. పాప రక్తాన్ని మార్చడం ద్వారా బైలురూబిన్ 17.6కు తగ్గింది. దీంతో మెదడు చురుగ్గా పని చేసిందని, పాపని డిస్చార్జ్ చేశామని డాక్టర్ తెలిపారు.



బేబీ కుటుంబీకులతో డాక్టర్ నిఖిల్

సెజ్ కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

ఎస్ఇజెడ్‌లోని పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన గురువారం అచ్యుతాపురం రహదారులపై నిరసన ర్యాలీ చేశారు. ఫార్మా పరిశ్రమలలో జరిగే ప్రమాదాలను అరికట్టాలని, దీనికి కారణమైన యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కార్యదర్శి కె.సోమినాయుడు మాట్లాడుతూ అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లోని ఫార్మా, ఇతర పరిశ్రమల్లో వేలాది మంది కార్మికులు పని చేస్తున్నారని, వారి ప్రాణాలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం, యాజమాన్యాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు. ఎటువంటి భద్రత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. ప్రమాదాల సంభవించే సమయాల్లో అరకొరగా పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు తప్పా ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడం లేదని చెప్పారు. ప్రమాదాల నివారణకు అన్ని పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని, ఆ నివేదికలు బయట పెట్టాలని, భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.వినయ్, కె.శంకర్రావు, కె.శ్రీను, ఎస్.సత్యారావు, కార్మికులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు


వైద్య శిబిరంలో పాల్గొన్న గ్రహణం మొర్రి బాధితులు

గ్రహణం మొర్రి వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష- సహిత విద్యా విభాగం, హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించిన గ్రహణం మొర్రి, గ్రహణ శూల వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో గురువారం జరిగిన ఈ శిబిరంలో 26 మంది వికలాంగ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వీరులో 13 మందికి ఉచితంగా శస్త్ర చికిత్సలు హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రిలో ఈనెల 20న నిర్వహిస్తామని ఆ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ముకుంద రెడ్డి తెలిపారు. రవాణా ఛార్జీలు కూడా తమ ఆసుపత్రి భరిస్తుందన్నారు. ఇదే ఆపరేషన్ ప్రైవేట్ గా చేయించుకుంటే రూ.80 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ శస్త్ర చికిత్సలు ఎంత తక్కువ వయసులో చేయించుకుంటే అంత ఎక్కువ ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో 24 మండలాల ప్రత్యేక ఉపాధ్యాయులు, వికలాంగ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.


భూమి పత్రాలు అందజేస్తున్న భూ దాతలు

పాఠశాల నిర్మాణానికి భూమి దానం

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి పంచాయతీ పరిధి నేరెళ్లపూడి గ్రామంలో పాఠశాల నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన పోయిరి ఈశ్వరరావు 8 సెంట్లు, పోయిరి గంగులు 7 సెంట్లు భూమిని దానం చేశారు. పోయిరి రాము, వార్డు మెంబర్ దేముడు ఆధ్వర్యాన దాతలు గురువారం భూమి పట్టా, డాక్యుమెంట్లను సర్పంచ్ దోమ్మంగి బోడెమ్మ, ఎంపీటీసీ బండి గౌరమ్మ చేతుల మీదుగా మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ రవీంద్రబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ రవీంద్రబాబు మాట్లాడుతూ గజం, సెంటు భూమి కోసమే ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, బంధువులు పోట్లాడుకుంటున్న ప్రస్తుత రోజుల్లో పాఠశాల కోసం గిరిజనులు తమ భూమిని విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. భూదాతలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గలేరు గంగులు, పోయిరి రాములు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకంపై హర్షం


ప్రజాశక్తి- వడ్డాది : విశ్వ బ్రాహ్మణులకు ప్రత్యేకంగా విశ్వకర్మ యోజన పథకాన్ని రూపొందిస్తున్నట్లు కేంద్ర బడ్జెట్‌లో మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించడం హర్షించదగ్గ విషయమని విశ్వ బ్రాహ్మణ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షులు దిమిలి రాజేష్ పేర్కొన్నారు. బుచ్చయ్యపేట మండలం బంగారమెట్టలో గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పంచ వృత్తుదారులైన కంచరి, కమ్మరి, స్వర్ణకారులు, వడ్రంగి, శిల్పి కళాకారులు చేసిన వస్తు సామాగ్రిలో ఎంత ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు. విశ్వబ్రాహ్మణులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గానుగుల బాబ్జి, మహిళ కార్యదర్శి కోరుకొండ సంతోషి పాల్గొన్నారు.

బీమా సొమ్ము బదిలీ చేయాలి

- ప్రమాదంలో రెండు కళ్లు పోగొట్టుకున్న బాధితుడు
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆవేదన

ప్రజాశక్తి-చోడవరం

గోవాడ చక్కెర కర్మాగారంలో పనిచేస్తూ రెండు కళ్ళు పోగొట్టుకున్న నందికోళ్ల సత్యారావు అనే రిటైర్డ్ కార్మికుడు ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా సొమ్ము ఇవ్వకపోవడంతో బాధితుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న సత్యారావుకు 2009లో సల్ఫర్ ఆవిరి తగలడంతో ఆయన రెండు కళ్ళు పూర్తిగా పోయాయి. అనంతరం 2014లో సత్యారావు రిటైర్ అయ్యాడు. ఫ్యాక్టరీ ద్వారా బీమా రూ.7,01,760 వచ్చింది. కార్మిక శాఖ ద్వారా ఈ సొమ్మును ఇన్సూరెన్స్ కంపెనీ ఫ్యాక్టరీ సారధ్యంలో ప్రభుత్వ సిఎఫ్ఎంఎస్ అకౌంటుకు నాలుగు నెలల క్రితం పంపించారు. దాని ద్వారా బాధితుని అకౌంట్‌కు సొమ్ము బదిలీ చేయవలసి ఉంది. కానీ సిఎఫ్ఎంఎస్ అకౌంట్లో నగదు లేకపోవడంతో బాధితుని అకౌంట్‌కు సొమ్ము రికవరీ కాలేదు. దీంతో అప్పులు చేసుకుని బతకాల్సి వస్తోందని సత్యారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సుగర్ ఫ్యాక్టరీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామునాయుడు మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చే ఇన్సూరెన్స్ ప్రభుత్వ అకౌంట్లోకి వేసిన తర్వాత దానిని ప్రభుత్వం తొక్కు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వం కార్మికులకు సాయం చేయకపోగా వారి సొమ్మును ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై సత్యారావు కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, త్వరలో అనకాపల్లి కలెక్టర్ ఆఫీస్ ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితుడు సత్యారావు


సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నేవీ నిర్వాసిత జెఎసి నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని వాడనర్సాపురం నేవీ మెయిన్ గేట్ ఎదుట ఎన్ఎఒబి నిర్వాసిత 8 గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళన గురువారం నాటికి 95వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శారద, వరహ నదిల్లో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించే వాళ్లమని, నేడు నేవీ అధికారులు అనుమతులు నిరాకరించడంతో చేపల వేట సాగక ఉపాధి కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. మా పొట్ట మీద కొట్టి మాకు అన్యాయం చేయడం దారుణమన్నారు. 95 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలపై ప్రభుత్వం, అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరారు.



నినాదాలు చేస్తున్న నేవీ నిర్వాసితులు


పింఛను అందజేస్తున్న వాలంటీరు అనిల్

విశాఖ ఆసుపత్రిలో పింఛను అందజేత

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారుమెట్ట గ్రామానికి చెందిన కొట్టాడ సత్యారావు కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖలోని మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ చికిత్స పొందుతుండగా, ఆయనకు లోపూడి సచివాలయ వాలంటీరు అలమండ అనిల్ తన సొంత ఖర్చులతో ఆసుపత్రికి వెళ్లి గురువారం పింఛను అందజేశారు. కష్టకాలంలో ఆసుపత్రికి వచ్చి పింఛను అందించిన అనిల్‌కు రుణపడి ఉంటామని సత్య రావు, ఆయన భార్య పద్మ తెలిపారు. అనిల్‌ను స్థానిక నాయకులు సాయం రమేష్, మెరుగు బాబురావు, యనమల వాసు తదితరులు అభినందించారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో శ్వేత ప్రతిభ

ప్రజాశక్తి -యలమంచిలి : యలంమంచిలికి చెందిన తైక్వాండో క్రీడాకారిణి తుంపాల శ్వేత జాతీయస్థాయి తైక్వాండో పాటీల్లో రజత పతకం సాధించింది. జనవరి 27 నుండి 29 వరకు ఉత్తరప్రదేశ్ బరేలిలో జరిగిన 39వ జూనియర్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించిన శ్వేత 55 కేజీల విభాగంలో రజత పతకం గెలుచుకుంది. ప్రతిష్టాత్మకమైన ఈ పతకం సాధించడం పట్ల శ్వేతను గురువారం న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అచ్యుతరెడ్డి, జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అచ్చం నాయుడు, అంతర్జాతీయ క్రీడాకారుడు కొఠారి దొరబాబు, హాకీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, యలమంచిలి తైక్వాండో క్లబ్ ఫౌండర్ నగిరెడ్డి సత్యనారాయణ తదితరులు అభినందించారు.


రజత పతకం, సర్టిఫికెట్ చూపుతున్న శ్వేత

చేతికందే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్లు

భయాందోళన చెందుతున్న గొన్నవానిపాలెం గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని పి.భీమవరం, దాని గ్రామమైన గొన్నవానిపాలెం గ్రామాల్లో విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. పి.భీమవరం గ్రామంలో పాల సెంటర్ రోడ్డులో విద్యుత్ వైర్లు రోడ్డుపై వేలాడుతున్నాయి. దీంతో అటువైపు రాకపోకలు సాగించేవారు భయపడుతున్నారు. గొన్నవానిపాలెం గ్రామం ప్రవేశంలోని భూలోకమ్మ గుడి నుండి ఆంజనేయ స్వామి గుడి వరకు గల రోడ్డులో ఉన్న విద్యుత్ కేబుల్ భూమికి ఆరడుగుల ఎత్తులోనే వేలాడుతుంది. ఈ మధ్యలో గల విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కోరారు. అయితే విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసిన 15 రోజులు దాటిపోయినా పట్టించుకోలేదని గొన్నవానిపాలెం గ్రామస్తులు వాపోయారు. పి భీమవరం, గొన్న వానిపాలెం గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ వైర్లను సరిచేయాలని కోరుతున్నారు. విద్యుత్ లైన్ల సమస్యపై స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ నాగ అప్పారావును ప్రజాశక్తి వివరణ కోరగా ఆ సమస్య తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని, వేలాడే విద్యుత్ వైర్లను రెండు రోజుల్లో సరి చేస్తామని ఆయన తెలిపారు.


చేతికి తగులుతున్న విద్యుత్ వైర్లు

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- కశింకోట : గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని బయ్యవరంలో రెండో రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన చేపట్టారు. గ్రామంలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీల సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి త్వరలోనే కాలువల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. రూ.48 లక్షలతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. డాక్టర్ వైఎస్ఆర్ సంచార పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ప్రారంభించారు. బయ్యవరంలో జరిగిన స్వాభిమాన్ ర్యాలీని ప్రారంభించారు. ముందుగా మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఉప సర్పంచ్ చోడే నాగ రాజు, ఎంపీటీసీ గొన్నా సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు, వైసిపి నాయకులు మళ్ల బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, మలసాల కిషోర్, పలకా రవి, నేటిపల్లి లక్ష్మి, గొల్లవిల్లి బాబూరావు, గొల్లవిల్లి నానాజీ పాల్గొన్నారు.

పక్షవాతం వ్యాధిగ్రస్తునికి పింఛను మంజూరు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురంలో పక్షవాతం బారిన పడ్డ వ్యక్తికి గురువారం పింఛను అందజేశారు. ఇటీవల మొగలిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దృష్టికి పక్షవాతంతో బాధపడుతున్న గురి జగన్నాథం సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే అనకాపల్లి వైద్యాధికారికి ఫోన్ చేసి పింఛను మంజూరు చేయాలని కోరారు. దీంతో జగన్నాథంకు నెలకు రూ.5వేలు పింఛను మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్లు యడ్ల నాయుడు, ఐడి బాబు, గండి మహాలక్ష్మి ముత్యాల నాయుడు, గండి దేవుళ్ళు, వెల్ఫేర్ అసిస్టెంట్ రేష్మ, మహిళ పోలీస్ రోహిణి, పాల్గొన్నారు.

జీవాలకు పొరుడు వ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ఎం.అలమండ గ్రామంలో నాలుగు నెలలు పిల్లల నుండి పెద్ద వాటి వరకు గొర్రెలు, మేకలకు పొరుడు వ్యాధి నివారణకు గురువారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఎం.అలమండ పశు వైద్యాధికారిణి మంజుషారాణి మాట్లాడుతూ ఈనెల 1 నుండి 28వ తేదీ వరకు గొర్రెలు మేకలలో పొరుడు వ్యాధి నివారణకు పిపిఆర్ టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. గొర్రెలు మేకలలో ఈ పొరుడు రోగం వలన వచ్చే నష్టాలను గురించి ఆ రైతులకు వివరించారు. వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపారు.

అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఎన్నాళ్లు ?

ప్రజాశక్తి-అనకాపల్లి : అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తూ ఎన్నాళ్లు ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తారని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి సూదికొండ మాణిక్యాలరావు గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నూతన జిల్లాగా ఆవిర్భవించిన అనకాపల్లికి రాష్ట్రంలో ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇక్కడ దాదాపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే నిర్వహించడం బాధాకరమని పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ భవనాలు ఉన్నా వాటికి కనీసం మరమ్మతులు కూడా చేయలేని దుస్థితి ఉందని తెలిపారు.

రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పాత రోడ్డు-గుల్లేపల్లి రోడ్డు నిర్మాణం పనులు వెంటనే చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం 9.80 కోట్లు నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ రోడ్డు 80 అడుగుల వెడల్పు చేసి నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. అధికారులు రూట్ మ్యాప్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి రాము నాయుడు, నాయకులు సబ్బవరపు ముత్యాల నాయుడు, సబ్బవరపు నారాయణ మూర్తి, ఇఇపిఆర్‌డి మహేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి - రాంబిల్లి : మండలంలోని వాడ నర్సాపురం నేవీ మెయిన్ గేటు ముందు జిమ్‌సర్ హాస్పిటల్ ఆధ్వర్యాన విశాఖపట్నం గీతం హాస్పిటల్ వారిచే గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో రోగులు వచ్చి వైద్య సేవలు పొందారు. కంటి వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులు, చిన్నపిల్లల వైద్య నిపుణులు, చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు, శర్మ వ్యాధుల డాక్టర్లు సంబంధిత రోగాలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వి.సుదర్శన్, వి.కిరణ్ సమక్షంలో ఈ శిబిరం జరిగింది.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండి చెయ్యి

సిపిఎం నాయకులు నాయినబాబు, ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- కె.కోటపాడు

కేంద్ర బిజెపి ప్రభుత్వం బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపించిందని సిపిఎం నాయకులు గండి నాయినబాబు, రొంగలి ముత్యాల నాయుడు పేర్కొన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం గురువారం వారు విలేకర్లతో మాట్లాడుతూ విభజన హామీలైన పోలవరం ప్రాజెక్టు, రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, ప్రత్యేక హోదా వంటి విషయాలను కేంద్రం విస్మరించడం దారుణమన్నారు. ధాన్యం సేకరణకు ఐదు శాతం కోత విధించడం, ఎరువులు సబ్సిడీ రూ.50.400 కోట్లకు కుదించడం వల్ల రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. ప్రజాసంఘాల మండల జిల్లా కన్వీనర్ ఎర్ర దేవుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు బడ్జెట్లో ఎటువంటి కేటాయింపులు లేవన్నారు. ఉపాధి హామీకి రూ.30వేల కోట్లు కోత విధించడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో రైతు నాయకులు వనము సూర్యనారాయణ, కెవిపిఎస్ జిల్లా నాయకులు గాడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు

అనకాపల్లి : రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, నిధులు, విభజన హామీల అమలు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రయోజనాలను ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కేంద్రానికి తాకట్టు పెట్టారని టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు విమర్శించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అధిక ధరలు, నిరుద్యోగం, ఆర్థిక మందగమనం వంటి అంశాల్లో కేంద్ర బడ్జెట్ సామాన్యులకు ఉపయోగకరంగా లేకపోయినా ముఖ్యమంత్రికి ప్రశ్నించే ధైర్యం లేదన్నారు. అధికార పార్టీకి 31 మంది ఎంపీలు ఉన్నప్పటికీ రాష్ట్రానికి న్యాయం చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. సిబిఐ, ఈడి కేసులు, వివేకానందరెడ్డి హత్య కేసు తప్పించుకునేందుకు జగన్‌రెడ్డి మౌనం వహిస్తున్నారని ఆరోపించారు. గతేడాది కంటే వ్యవసాయ రంగానికి రూ.28 వేల కోట్ల కోత విధించారని, లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలను బడ్జెట్ విస్మరించిందని తెలిపారు. లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చిన కేంద్రం అన్నం పెట్టే రైతన్నకు రుణమాఫీ చేసేందుకు ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు లాలం కాశీనాయుడు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

పేద, బడుగు బలహీన వర్గాలకు ఉపయోగం లేని బడ్జెట్

కేంద్ర బడ్జెట్ పేద బడుగు బలహీన వర్గాలకు ఉపయోగకరంగా లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యులు కోన లక్ష్మణ విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టే విధంగాను, పేద మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం మోపేదిగా ఇది ఉందని తెలిపారు. ఉపాధి హామీకి నిధులు కోత విధించడం దారుణమన్నారు.

రైతుల ప్రస్తావన లేని బడ్జెట్

కేంద్ర బడ్జెట్లో రైతులకు రాయితీలు, రైతుల ప్రయోజనకరం అంశాలు లేకపోవడం బాధాకరమని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు, ప్రత్యేక హోదా, వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు వంటి అంశాలను విస్మరించడం దుర్మార్గమన్నారు.

చెరువు గర్భం ఆక్రమణపై ఫిర్యాదు

వెంటనే స్పందించి నిలువరించిన రెవెన్యూ అధికారులు



జెసిబితో హద్దులు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని బంగారమ్మపాలెం పంచాయతీ పరిధి సర్వే నెంబర్ 49, 50, 51లో సుమారు 30 ఎకరాలు చెరువులో కొంత భూమిని ఆక్రమించిన వారిపై చెరువు ఆయకట్టు రైతులు 200 మంది గురువారం తహశీల్దారుకు ఫిర్యాదు చేశారు. ఈ చెరువును ఆనుకొని దాడి శ్రీరామ్మూర్తి కుమారులు దాడి ఉమామహేష్, దాడి తేజకు సుమారు 8 ఎకరాలు జిరాయితీ భూమి ఉందని, గురువారం వీరు తమ భూమితో పాటు పక్కనే ఉన్న చెరువు గర్భంలో గల తాటి చెట్లు తీసివేసి ఆక్రమణకు పాల్పడ్డారని, దీనిని దాడి శ్రీరామ్మూర్తి, కన్నంనాయుడు ప్రోత్సహిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాతల కాలం నుండి ఈ చెరువు నీటితో భూములను సాగుచేసుకొని జీవనోపాధి పొందుతున్నామని, ఇప్పుడు చెరువు గర్భం ఆక్రమించడంతో సాగునీరు అందే పరిస్థితి ఉండదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

దీనికి స్పందించిన తహశీల్దార్ ఇరు వర్గాల రైతులకు ఉన్న అధికారిక భూ పత్రాలు పరిశీలించి తగిన విధంగా న్యాయం చేయాలని తమ సిబ్బందిని ఆదేశించారు. దీంతో ఆర్ఐ వీరయ్య, ఇరిగేషన్ ఎఇ రామ లక్ష్మణ ఆక్రమణకు గురైన చెరువు గర్భాన్ని పరిశీలించి ఆక్రమణలను నిలవరించారు. జెసిబితో చెరువు గర్భానికి వెళ్లే నీటి కాలువలను సరిచేసి గట్టు వేశారు. చెరువు హద్దులు గుర్తించి సరిహద్దు రాళ్లు వేస్తామని చెప్పారు.

ఇదిలా ఉండగా దాడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ తన జిరాయితీ భూమితో పాటు పక్కనే ఉన్న చెరువు గర్భంలో కొంత భాగం కొన్నేళ్లుగా తన ఆధీనంలో ఉందని, దానిలో ఉన్న మొక్కలను తొలగించానని చెప్పారు. తాను చెరువు గర్భాన్ని ఆక్రమించలేదని, తన ఆధీనంలో ఉన్న భూమిని మాత్రమే చదును చేశానని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు, మాజీ ఎంపీటీసీ దొడ్డి అరుణ సూర్య ప్రకాష్, సూరిశెట్టి రమణ, రాజ్ కోటి తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లం పేరుతో ఇబ్బంది పెడితే సహించేది లేదు

ప్రజాశక్తి-కశింకోట : నల్లబెల్లం పేరుతో వైసిపి ప్రభుత్వం చెరుకు రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హెచ్చరించారు. ప్రభుత్వానికి రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే చెరుకు, బెల్లం రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. మండలంలోని మోసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. చెరుకు, బెల్లం రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీని ఆధునికీకరించి తెరిపించాలని డిమాండ్ చేశారు. మంత్రి గుడివాడ అమర్నాథ్ వైఫల్యం వల్లే 13వేల మంది చెరుకు రైతులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాయల మురళి, నైనంశెట్టి రమణారావు, ఒమ్మి సత్యనారాయణ, వెంకట అప్పారావు, గోకివాడ మహారాజు, దుద్దేటి శ్రీను, గోకివాడ లోవకృష్ణ, గోకివాడ రాజు, బొట్టా చిన్నా, అల్లు రామకృష్ణ, సర్వసిద్ధి నాగేశ్వరరావు, అల్లు సాయి, గొలగాని బాబు, కరణం గోవింద్ పాల్గొన్నారు.

ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యాన చెరువు అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఏషియన్ పెయింట్స్ సిఎస్ఆర్ నిధులతో మండలంలోని ఎర్రవరం గ్రామంలోని అచ్చన్న చెరువులో పూడికతీత, అభివృద్ధి పనులు గురువారం చేపట్టారు. ఈ చెరువులో బ్రిటిష్ కాలం నుండి నేటి వరకు ఎటువంటి పడిక తీత పనులు చేయలేదు. ఈ చెరువు పరిస్థితిని గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మీరాము ఎమ్మెల్యే కన్నబాబురాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సిఫారసు మేరకు ఏషియన్ పెయింట్స్ యాజమాన్యం సిఎస్ఆర్ నిధులతో చెరువు కూడికతీత పనులు చేపట్టింది. కల్వర్టు నిర్మాణం చేస్తున్నారు. కాలువలు తవ్వించారు. పొలాలకు వెళ్లే కాలువ జంగిల్ క్లియరెన్స్ పనులు చేశారు. ఈ చెరువు కింద 250 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పూడిక తీత ద్వారా ఈ భూములకు సాగు అందనుందని రైతులు గంగిరెడ్డి రాము, సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్‌కు గ్రామ సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి రాము ధన్యవాదాలు తెలిపారు.



శైలజ, విజయకుమార్ పెళ్లి నాటి ఫొటో

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- పరవాడ : స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న గొర్లివాని పాలెం పంచాయతీ బసవతారకరామ నగర్ కాలనీలో నివాసముంటున్న పైలా శైలజ (25) బుధవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శైలజ, ఆమె భర్త పైలా విజయకుమార్, వారి కుమారుడు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. తెల్లవారుజామున 5 గంటల తరువాత భర్త విజయకుమార్ నిద్ర లేచి చూసే సరికి వారి గదిలోని ఫ్యాన్ హుక్కుకు శైలజ వేలాడు మృతి చెంది ఉంది. దీంతో తన అత్తమామలకు ఫోన్ చేసి రాత్రి 12 గంటల నుండి తెల్లవారుజామున 5 గంటల మధ్య తన ఇంటి ఫ్యాన్ హుక్కుకు ఉరేసుకొని ఉంటుందని తెలియజేశాడు. దీంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించారు. పరవాడ సిఐ పి.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శైలజకు విజయ్ కుమార్‌తో వివాహమై నాలుగు సంవత్సరాలైంది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నారు. మూడేళ్ల పాటు వీరు శైలజ అమ్మగారి ఇంటి వద్ద పెందుర్తిలో నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం నుండి బసవతారకరామ నగర్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని నివాసముంటున్నారు. విజయ్‌కుమార్ పరవాడలో ఎలక్ట్రికల్ జూనియర్ లైన్‌మెన్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నాడు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండే వారిని, తన కుమార్తె ఎందుకు ఇలా ఉరేసుకుందో అర్థం కాలేదని శైలజ తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపాలెం ఫీడర్ పరిధిలో గ్రామాలైన రామన్నపాలెం, శెట్టిపాలెం, దుంగవానిపాలెం, జెడ్.గంగవరం, ఎరకన్నపాలెం, ధర్మవరం, వెంకటాపురం, చినరాచపల్లి, వెంకన్నపాలెం, భీమబోయినపాలెం ఫీడర్ పరిధిలోని రాజుపేట, భీమబోయినపాలెం, గండిపేట, చింతలూరు, చింతలూరు సెంటర్, కన్నూరుపాలెం, ఎజిఎల్ రూరల్ ఫీడర్ల పరిధిలోని కన్నూరుపాలెం, తీడ, ఆనందపురం, చెరకాం, కచ్చాలపాలెం, ఎల్.కొత్తూరు, చిన్నయ్యపాలెం, జి.భీమవరం, అడ్డం, అచ్చర్ల, మోసయ్యపేట, గోకివన్నపాలెం, సింగవరం తదితర గ్రామాలు, తోటకూరపాలెం క్వారీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

13న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కరక గ్రామంలో పెద్దదేముడుబాబు గంగాలమ్మ జాతర సందర్భంగా ఈ నెల 13న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఒక టీమ్‌లో ఉన్న ఆటగాడు, మరొక టీమ్‌లో ఉండరాదన్నారు. టోర్నీలోపాల్గొనే జట్లు ప్రవేశరుసుము కింద రూ.300 చెల్లించి, 12న ఆదివారం సాయంత్రంలోగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అంపైర్‌దే తుది నిర్ణయమన్నారు.

13న ఆటగాళ్లకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.10,016, రెండవ బహుమతిగా రూ.5,016 ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు పి.దారబాబు 8143713023, ఎం.దేముడు 9177579537, వి.లక్ష్మణ్ 9618971441, పి.రమణ 9502864482 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో అనకాపల్లి డివిజనల్ ఇంజనీర్ ఆదేశాల మేరకు శుక్రవారం విద్యుత్ లైన్ క్లియరెన్స్ నిర్వహణ పనులు చేపట్టనున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎపి ట్రాన్స్‌కో ఎఇ కృష్ణ గురువారం తెలిపారు. ఎస్ రాయవరం మండలం, కొరుప్రోలు సబ్‌స్టేషన్ లైన్ క్లియరెన్స్ పనులు చేపడతామని, దీంతో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉపమాక సబ్ స్టేషన్‌లో కూడా లైన్ క్లియరెన్స్ పనుల వల్ల ఉపమాక, నక్కపల్లి, రాజయ్యపేట, పెద్ద తీనార్ల, చిన్న తీనార్ల, దొండవాక, కాగిత, న్యాయంపూడి, ఎన్ నరసాపురం, మన బాలవానిపాలెం, సారిపల్లివానిపాలెం, సిహెచ్ లక్ష్మీపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఎఇ కోరారు.

రక్తహీనత పట్ల అప్రమత్తత

ప్రజాశక్తి -కోటవురట్ల: మహిళలు, చిన్నారుల్లో రక్తహీనత వల్ల వచ్చే రుగ్మతలు, అనారోగ్య సమస్యలపై వారిని అనునిత్యం అప్రమత్తత చేయాలని డాక్టర్ సంతోష్‌కుమార్ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎఎన్‌ఎంలు, అంగన్వాడీలు, ఆశాలకు రక్తహీనతపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా డాక్టర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూమహిళలకు చిన్నారులకు తరచూ హెచ్‌బి పరీక్షలు చేయించాలని, రిపోర్టులు ఆధారంగా వారికి అవసరమైన మందులు అందజేయాలన్నారు. అలాగే పోషకాహార విలువలు గురించి తెలియజేయడంతో పాటు ఐరన్ మాత్రలు అందించాలని సూచించారు, వైద్య సిబ్బంది పాఠశాలల్లో తరచూ పరీక్షలు నిర్వహించాలని, గర్భిణీలు బాలింతలను గమనించాలన్నారు. కార్యక్రమంలోే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి గోవింద్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి- చీడికాడ : మండలంలోని తునివలస పంచాయతీ ఇంటిపాలెం గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సంబంధిత లబ్ధిదారులకు గురువారం వైసిపి మండల కన్వీనర్ రాజబాబు, మండల ఉపాధ్యక్షుడు ధర్మిశెట్టి స్వాతికొండబాబు, సర్పంచ్ పడాల హైమశ్రీను ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విస్సారపు జయలక్ష్మి నాగేశ్వరరావు, వాలంటీర్లు, పార్టీ కార్యకర్త నాగేష్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు మొక్కల అందజేత

ప్రజాశక్తి- నర్సీపట్నం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన 'సాయానికి పది రూపాయలు' సంస్థ వ్యవస్థాపకులు జి.నూకరాజు మాస్టారు గురువారం తన వంతు సాయంగా 93 మొక్కలను అందజేశారు. అనంతరం ఈ మొక్కలను కళాశాల ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా నూకరాజు మాస్టారుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాజు ఆధ్వర్యంలో అధ్యాపక బందం విద్యార్థులు కతజ్ఞతలు తెలియజేశారు.

'పది' విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి,-నక్కపల్లి : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంఇఒ డివిడి ప్రసాద్ అన్నారు. మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు సారిపల్లిపాలెంలో గురువారం రాత్రి పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు ఎంఇఒ డివిడి ప్రసాద్, నక్కపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్ .ఆచార్యులు సందర్శించారు. పదో తరగతి విద్యార్థులు ఇళ్ల వద్ద ఎలా చదువుతున్నారో అనే విషయాన్ని నేరుగా పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రతిరోజూ ఇళ్ల వద్ద పిల్లలు చదువుతున్నారా లేదా అని ఆరా తీశారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించి పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన అంశాలను ఇంటి వద్ద చదివించాలన్నారు. టివిలకు దూరంగా ఉంచాలని, సెల్‌ఫోన్లు దరికి విద్యార్థులను చేరనీయవద్దన్నారు. చదివిన అంశాన్ని ఎక్కువగా రాయించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా తెలియని అంశాలను ఆయా ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు .పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని, మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నిర్లక్ష్యం వీడిచదువుపై దష్టి సారించాలన్నారు. గ్రామంలో యువకులు, ఉత్సాహవంతులు ముందుకు వచ్చి స్టడీ సెంటరును ఏర్పాటు చేసేవిధంగా ఆలోచన చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు రాత్రివేళలో గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాలలో స్టడీ సెంటరు ఏర్పాటుకు కృషి చేస్తున్న తీరు అభినందనీయమన్నారు.



విద్యార్థుల ప్రగతిని తెలుసుకుంటున్న ఎంఇఒ

ఉపాధి నిధులతో పంట పొలాలకు మట్టిరోడ్డు



మట్టిరోడ్డు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో కవగుంట గ్రామంలో ఉపాధి హామీ నిధులతో సుమారు కిలోమీటర్ మేర మట్టి రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా చేపడుతున్నట్లు సర్పంచ్ సూర్యకుమార్ వరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రావికమతం నుంచి కింతలి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు , పుట్టమణి పొలం చెక్‌డ్యాం, విజె. పురం. మళ్లీ ఆర్అండ్‌బి రోడ్డు వరకు రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పండిన పంటను పొలాల నుంచి ఇళ్లకు తెచ్చుకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారికి కనీస మార్గాన్ని చూపించే విధంగా, అలాగే ట్రాక్టర్లు, బైక్‌లు, వ్యాన్లు, ఇతర వాహనాలు వెళ్లే విధంగా మట్టి రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.తర్వాత రోడ్డును గ్రావెల్‌తో పటిష్టం చేయడానికి కృషి చేస్తానన్నారు. పంట పొలాలకు మట్టి రోడ్డు నిర్మాణంపై పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

పొగ కాలుష్యంతో పరేషాన్!

ప్రజాశక్తి -కోటవురట్ల : మండల కేంద్రంలో ప్రధాన కూడలి వద్ద పొగకాలుష్యంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి సేకరించిన చెత్తను సమీపంలోని వంతెన వద్ద వేసి తగలబెట్టడంతో వచ్చే పొగ కారణంగా కళ్ల మంటలు, దారి కనిపించకపోవడం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బందులు వంటి పలు అవస్థలు పడుతున్నారు. సమీపంలోని స్వీట్ షాపుల నుంచి నిరంతరాయం గా నిత్యం కర్మాగారంలో వచ్చే పొగ మాదిరి కమ్ముకోవడంతో సమీప ప్రాంత ఇళ్లల్లోకి పొగ కమ్మేస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. ముఖ్యంగా చిన్నారులు వద్ధులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ప్రధాన కూడలిలో వాయు కాలుష్యం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రధాన కూడలిలో కమ్ముకున్న పొగ

ఘనంగా చిత్తడి నేలల దినోత్సవం



చెరువులో చేపపిల్లలు వదులుతున్న అటవీ అధికారులు,

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల ఆధ్వర్యాన గురువారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని కొండకర్ల ఆవలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు, వన్యప్రాణి ప్రేమికులు, ప్రకృతి ప్రేమికులు, బర్డ్ వాచర్స్ పాల్గొన్నారు. చిత్తడి నేలల ప్రాముఖ్యతను బర్డ్‌వాక్, నేచర్ వాక్ నిపుణులతో చర్చించారు. ఈ సందర్భంగా కొండకర్ల ఆవలో పలు ముఖ్యమైన మంచినీటి చేపలను విడుదల చేశారు. స్థానిక మత్స్యకారులచే చేపలు పట్టే వివిధ సంప్రదాయ పద్ధతులను ప్రదర్శించారు. విశాఖపట్నం చిత్తడి నేలల ప్రాముఖ్యత, చిత్తడి నేలల సంరక్షణకు అటవీశాఖ చేస్తున్న కృషి, స్థానిక సంఘాల ప్రమేయం గురించి వివరించారు. ఎపిలో చిత్తడి నేలల పరిరక్షణకు అటవీ శాఖతో సమర్ధవంతమైన భాగస్వామ్యాన్ని ఏర్పరుచుకునేందుకు పాఠశాలలు, కళాశాలలు, కార్పొరేట్ సంస్థలు, పౌర సమాజం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

నర్సీపట్నం రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ చిత్తడి నేలల దినోత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజు సమావేశంలో మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవడంలో చిత్తడి నేలల ఆవశ్యకతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్.కృష్ణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా ప్రతి విద్యాసంస్థలలోనూ ఇటువంటి దినోత్సవాలు జరుపుకోవాలని సూచించారు. కళాశాల ఇసిఒ క్లబ్ కన్వీనర్ బి.తేజస్వి, తదితర అధ్యాపకులు చిత్తడి నేలలను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత మహిళకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -పాయకరావుపేట : మండలంలోని పడాలవాని లక్ష్మీపురంలోని విఆర్ఒ బాధిత దళిత ఒంటరి మహిళ, విల్లి సాయిలక్ష్మి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే వైసిపి నేత చెంగల వెంకటరావు గురువారం పరామర్శించారు. తన అభిమానులతో కలిసి గ్రామానికి వచ్చి, విఆర్ఒ భాస్కరనాయుడు వేధింపులతో తీవ్ర ఇబ్బందులకు గురై, ఇళ్ల స్థలం రాకుండా పోయిన సాయిలక్ష్మికి అన్ని విధాలా తన సహాయ సహకారాలు అందిస్తానని ధైర్యం చెప్పి ఓదార్చారు. ఇంటి స్థలం ఇప్పించేందుకు కృషి చేస్తానని అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళతానన్నారు. తమ సమస్యను తెలుసుకుని పరామర్శించేందుకు వచ్చి భరోసానిచ్చిన మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావుకు బాధిత మహిళ ధన్యవాదాలు తెలిపింది. విఆర్ఒ భాస్కరనాయుడు వైఖరి కారణంగా తనతోపాటు చాలామంది అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలం లేకుండా పోయిందని, వారందరినీ ఆదుకోవాలని సాయిలక్ష్మి కోరింది. కార్యక్రమంలో సర్పంచ్ పడాల సోమన్న దొర, చెంగల అభిమానులు పాల్గొన్నారు

ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి -మాకవరపాలెం : ప్రభుత్వం భూమిలో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగిపోవాలని, లేకుంటే తామే తొలగించాల్సి ఉంటుందని తహశీల్దార్ ప్రసాదరావు హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టిన పది షెడ్లలో రెండింటిని మాత్రమే తొలిగించి మిగిలిన వాటిని వదిలేయడంపై మండలంలో ఇ-కోడూరు గ్రామానికి చెందిన టిడిపి నేత జయరామ్ ఇటీవల స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ప్రసాదరావు, ఇరిగేషన్ జెఇ రాజేష్‌తో కలిసి వెళ్లి గురువారం ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగిపోవాలని హెచ్చరించారు. అనంతరం అక్రమణలో ఉన్న భూమికి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు

మాఘ పౌర్ణమి జాతర ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని రేవుపోలవరం సముద్ర తీరంలో ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్న మాఘ పౌర్ణమి జాతర ఏర్పాట్లను సిఐ నారాయణరావు, ఎస్ఐ ప్రసాదరావు గురువారం పరిశీలించారు. ఈ యాత్రకు వేల సంఖ్యలో యాత్రికులు తరలిరానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలాగే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అనువైన ఏర్పాట్లు పోలీసులు యంత్రాంగం చేపడుతుందన్నారు. బైకులు, వాహనాలు, ఆర్‌టిసి బస్సులు పార్కింగ్‌కు సంబంధిత స్థలాన్ని వారు పరిశీలించారు.

ఉపమాక సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక సచివాలయాన్ని ఎంపిడిఒ సీతారామరాజు, ఇఒపిఆర్‌డి వెంకటనారాయణ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. అంకితభావంతో బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. సేవలపై ప్రజల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు .రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయప్రకాష్, నక్కపల్లి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ,డిజిటల్ అసిస్టెంట్ సురేష్ ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంపై పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : స్థానిక గురుకుల పాఠశాల, కెజిబివి పాఠశాలలను గురువారం ఎంఇఒ డివిడి.ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపయోగిస్తున్న ట్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు ఏ విధంగా వాటిని ఉపయోగిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. తరగతిలో బోధన అనంతరం ప్రతి విద్యార్థీ తప్పనిసరిగా ట్యాబ్‌ల ద్వారా ఆ పాఠాలపై మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ట్యాబ్‌లను ప్రభుత్వం అందజేసిందన్నారు.ఉపాధ్యాయులు చెప్పిన రీతిలో విద్యార్థులు ట్యాబ్ లను ఉపయోగించి చదువులో ఉన్నతంగా రాణించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి అర్ధమయ్యే రీతిలో ఉపాధ్యాయులు విద్యా బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టి.శారద, ఉపాధ్యాయురాలు శర్వాణి, నక్కపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొన్నారు

మీనాక్షిని అభినందించిన కలెక్టర్



మీనాక్షిని అభినందిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి- కలెక్టరేట్ : విశాఖకు చెందిన చదరంగం క్రీడాకారిణి కోలగట్ల అలన మీనాక్షిని జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున గురువారం అభినందించారు. మీనాక్షి చదరంగంలో విశాఖ ఫిడే మాస్టర్ టైటిల్ సాధించింది. అలాగే ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాల పురస్కార్- 2023 అవార్డును క్రీడా విభాగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా అందుకుంది. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా కలెక్టర్‌ను ఆమె కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఎన్.సూర్యారావు, కార్యదర్శి మణికంఠరావు, చెస్ కోచ్ చిరంజీవి పాల్గొన్నారు.

పింఛను పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి- ఎస్.రాయవరం : మండలంలోని ధర్మవరం అగ్రహారం గ్రామానికి చెందిన కూండ్రపు బంగారమ్మకు 16 నెలలుగా నిలిచిపోయిన పింఛనును ఈ నెల నుంచి పునరుద్ధరించి చెల్లించడంపై ఆనందం వ్యక్తం చేసింది. అర్వ్హాలిని కావడంతోపాటు పింఛనుపైనే ఆధారపడి జీవిస్తున్న తన పింఛనును నిలిపేశారని బంగరమ్మ సచివాలయ వద్ద నిరసన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, వెల్ఫేర్ అసిస్టెంట్ దొరబాబు పింఛను పునరుద్ధరణకు చర్యలు చేపట్టగా, మళ్లీ మంజూరైన పింఛనును లబ్ధిదారు బంగారమ్మకు స్థానిక సర్పంచ్ అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు, వాలంటీరు సూర్యకళ పాల్గొన్నారు. కాగా తన పింఛనును పునరుద్ధరించిన అధికారులు, నేతలకు బంగారమ్మ కన్నీళ్లతో కృతజ్ఞతలు తెలిపింది.

స్కూల్ గేమ్స్ బాక్సింగ్‌లో మౌనికకు స్వర్ణం



మౌనికను అభినందిస్తున్న కోచ్, తదితరులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్/ రూరల్ : మూడు రోజులుగా రాజమండ్రిలో జరుగుతున్న 66వ ఎపి స్టేట్ స్కూల్ గేమ్స్ అండర్ 17 బాలికల బాక్సర్ పోటీల్లో నర్సీపట్నం నింజాస్ అకాడమీ బాక్సర్ బొంతు మౌనిక 75 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. ఈమెకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెడల్ అందజేశారు. కష్ణా, గుంటూరు, అనంతపురం జిల్లాలతో ఆడి, ఆర్‌ఎస్‌సి నాకౌట్ విజేతగా నిలిచి గెలుపొందిందని శాప్ కోచ్ అబ్బు తెలిపారు.మౌనిక విజయం పట్ల అకాడమీ డైరెక్టర్, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేడు అడవి రాజులబాబు పండగ

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో అడవిరాజులబాబు పండుగ సందర్భంగా కామిరెడ్డి వారి ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 10 గంటలకు ఊరేగింపు, ఆర్కెస్ట్రా, సాయంత్రం కరుణా ఈవెంట్స్ డాన్స్‌బేబి డాన్స్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే జానకిరామ్ ఈవెంట్స్ రేలారే రేలా కార్యక్రమం జరుగుతుందన్నారు. భక్తులు అందరూ అడవిరాజుల బాబులను దర్శించి, పండుగను జయప్రదం చేయాలని కోరారు.

పోర్టు ప్రైవేటీకరణపై..

10న సీ హార్స్ జంక్షన్ వద్ద ధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు హాస్పిటల్ (జిహెచ్)ను పిపిపి పద్ధతిలో ప్రైవేటుకు ఇవ్వడాన్ని విరమించుకోవాలని పోర్టు సిఐటియు యూనియన్ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. గురువారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు స్థలాలు, స్టేడియం, కళ్యాణ మండపాలను ప్రైవేటువారికి ఇవ్వరాదన్నారు. ఎన్ఎంపి పేరుతో బెర్తుల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చరాదన్నారు. సిహెచ్ క్యాజువల్, పూల్, పోర్టు కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. పెండింగ్ బోనస్ ఇవ్వాలన్నారు. కొత్త బోనస్ ఫార్ములాలో షరతులు లేని వేతన ఒప్పందం వెంటనే చేయాలన్నారు. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని, న్యూ స్టీవ్ డోరింగ్ పాలసీని అమలు చేయరాదని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10న సీ హార్స్ జంక్షన్ వద్ద తమ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మేజర్ పోర్టు ట్రస్ట్ యాక్ట్-1963 స్థానంలో మేజర్ పోర్టుల అథారిటీ యాక్ట్-2021ని అమల్లోకి తీసుకువచ్చారని తెలిపారు. దీంతో పోర్టులకు చట్టపరమైన రక్షణ నిర్వీర్యమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 38 సంవత్సరాలుగా వేలాది మంది కార్మికులకు, పెన్షనర్లకు, వారి కుటుంబ సభ్యులకు వైద్యాన్ని అందిస్తోందన్నారు. అటువంటి హాస్పిటల్‌ను క్రిసిల్ రిమ్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ సొల్యూషన్స్ లిమిటెడ్ (ముంబయి) అనే ప్రైవేట్ కంపెనీకి పిపిపి పద్ధతిలో కట్టబెట్టాలని నిర్ణయం చేసి షిప్పింగ్ మినిస్ట్రీ అనుమతి కోసం పోర్టు యాజమాన్యం పంపిందన్నారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని తెలిపారు. అనంతరం పోర్టులోని బెర్తులను ఎలా ప్రైవేటుపరం చేశారో, పర్యవసానాలేంటో జగన్ వివరించారు. పోర్టును నష్టాల్లోకి నెట్టడానికి చూస్తున్నారని విమర్శించారు. గతంలో పర్మినెంట్, నాన్ పర్మినెంట్ కలిపి 30 వేల మంది పనిచేసేవారని, నేడు పర్మినెంట్ ఉద్యోగులుగా 2400 మంది, నాన్ పర్మినెంట్ ఉద్యోగులుగా 5 వేల మంది మాత్రమే పనిచేస్తున్నారని తెలిపారు. బెర్తలను ప్రైవేటుకు ఇస్తే ఇంకా ఉద్యోగాలు పోతాయన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో విడిఎల్‌బి డాక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జె.సత్యనారాయణ, లక్ష్మణరావు, నాయకులు రామలింగేశ్వరరావు, త్రినాథరావు, పి.శంకరరావు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలి

తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అనిత



ఇదేం ఖర్మలో పాల్గొన్న అనిత, ఇతర టిడిపి నేతలు

ప్రజాశక్తి -కోటవురట్ల : రాష్ట్రంలో ఆరాచక పాలన సాగిస్తున్న వైసిపి సైకో ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. గురువారం అన్నవరం గ్రామంలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు సైతం సక్రమంగా జరగక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నా జగన్ ప్రభుత్వానికి పట్టకపోవడం శోచనీయమన్నారు. నిత్యావసర వస్తువులు ఆకాశాన్ని అంటాయన్నారు, ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే, మద్యం ఇసుక వ్యాపారాలతో జగన్ ఆదాయాన్ని పెంచుకుంటున్నారని, అక్రమమార్గంలో సంపాదించిన సొమ్ముతో రానున్న ఎన్నికల్లో ప్రజల మభ్యపెట్టాలని చూస్తున్నాడని, ప్రజలంతాఅప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఒక్క ఛాన్స్ ఇస్తేనే రాష్ట్రాన్ని అథోగతి పాల్జేశారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఏమాత్రం అవకాశమిచ్చినా ఇక తెలుగు ప్రజలకు పుట్టగతులే ఉండవని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు, వేచలపు భాస్కరరావు, కోటఉరట్ల ఎంపీటీసీ పి,సూర్యారావు, కొడవటిపూడి ఎంపిటిసి సూర్యప్రకాష్, మండల తెలుగు యువత అధ్యక్షులు తిరుమలరావు, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు సత్యవతి, పలువురు నాయకులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.. గొట్టువాడ గ్రామంలో బండిమాంబ అమ్మవారి పండుగ సందర్భంగా గురువారం మాజీ ఎమ్మెల్యే అనిత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా గ్రామస్తులకు, కార్యకర్తలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

కొనుగోళ్లు లేక ధాన్యం రైతుల ఇక్కట్లు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేసే నాథుడే లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర ఆరోపించారు. ఫ్పటి వరకు కేవలం 20 శాతం మాత్రమే ధాన్యం కొనుగోలు చేశారని, రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించే పరిస్థితి లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పండించిన ధాన్యం నిల్వలు అమ్ముడుపోక అయోమయంగా ఉన్న 80 శాతం మంది రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిసెంబరులో కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యం రంగు మారి, నూక అవడంతో మిల్లర్లు తిరిగి పంపించేస్తున్నారన్నారు. ఈ నెల 15వ తేదీ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటనలు చేస్తున్నా, ఎక్కడా కొనుగోళ్లు జరగడం లేదని ఆరోపించారు. రైతు వద్ద ఉన్న ధాన్యాన్ని అమ్ముకోవడానికి ఆన్‌లైన్లో బుక్ చేసుకుంటే బిక్కవోలు, యలమంచిలి తదితర ప్రాంతాలకు వెళ్లాలని సూచిస్తున్నారని, అంతదూరం తీసుకెళ్లడం రైతులకు వ్యయప్రయాసలతో కూడుకున్నందున రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

నేరేడుబంద సమస్యల పరిష్కారానికి చర్యలు

కాలినడకన మారుమూల గ్రామాలను సందర్శించిన పాడేరు ఐటిడిఎ పిఒ గోపాలకృష్ణ



గిరిజనులతో సమావేశమై మాట్లాడుతున్న పిఒ గోపాలకృష్ణ

ప్రజాశక్తి- కొత్తకోట : అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు శివారు, అల్లూరి జిల్లా జి. మాడుగుల మండలం గడుతూరి పంచాయతీ శివారు సరిహద్దు ఆదివాసీ గ్రామ మైన నేరేడుబంధ గ్రామాన్ని పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ, తదితర అధికారుల బృందం గురువారం సందర్శించారు. చీమలపాడు పంచాయతీ శివారు జడ్.జోగంపేట గ్రామం నుంచి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కాలినడకన ప్రయాణం చేసి కొండపై ఉన్న గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో సమస్యలపై గత కొంతకాలంగా ఐదవ షెడ్యూల్ సాధన కమిటి, గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలు మార్లు ఆ గ్రామ సమస్య లపై ఫిర్యాదు లు చేయడంతో పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టిన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన పిఒ గోపాలకృష్ణ తదితర అధికారులు నేరేడు బంద గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమయ్యారు. తమ గ్రామంలో సుమారు 60 మంది జనాభా కలిగి ఉన్నప్పటికీ రహదారి, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు లేవని, 9 మంది విద్యార్థులకు పాఠశాల సౌకర్యం లేక అటవీ ప్రాంతంలోనే గుర్రాలపై ప్రయాణం చేసి జోగంపేట పాఠశాలకు వెళు_న్నారని, అలాగే అంగన్వాడీ కేంద్రం లేక మరికొంత చిన్నారులకు పోషకఆహారం అందలేదని తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. అంతేకాక తమ గ్రామంలో 60 మంది జనాభాలో కేవలం 8 మందికి మాత్రమే ఓటు హక్కు ఉందన్నారు.ఉపాధి హామీ పథకం, విద్యార్థులకు జగనన్న విద్యా కానుక వంటి ప్రభుత్వ పథకాలు అందలేదని ఆదివాసీలు కిల్లో డిప్పల, కిల్లో అప్పారావు తదితరులు పిఒకు తెలిపారు. సమస్యలపై స్పందించిన పిఒ గోపాలకృష్ణ నేరేడుబందలో తాత్కాలిక పాఠశాల భవన నిర్మాణానికి రూ. లక్ష నిధులను ఐటిడిఎ నుంచి మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక. అమ్మ ఒడి పథకాలు మంజూరుకు కృషి చేస్తానన్నారు ఉపాధి హామీ ద్వారా పనికల్పన, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు. అందుకు కావలసిన నివేదిక తయారు చేయాలని రావికమతం తహశీల్దార్ మహేశ్వరరావు, ఎంపిడిఒ వెంకన్న బాబులతోపాటు జి మాడుగుల ఎంపిడిఒ, తహశీల్దార్లను ఆదేశించారు.కార్యక్రమంలో సర్పంచ్ వి. గంగరాజు, ఐదవ షెడ్యూల్ సాధన కమిటి గౌరవ అధ్యక్షులు కె. గోవిందరావు, గిరిజన సంఘం నాయకులు, పలువురు గ్రామ స్థాయి అధికారులు పాల్గొన్నారు.